

వెన్నెలనంతా మోసుకు పోతున్నట్లు వెళ్ళే భర్తని, వరండా చీకటిలో నిలిచి, కాదంబిని మౌనంగా సాగనంపింది. ప్రతిరోజూ భర్త బయటకు వెళ్ళటం మాత్రమే చూచే ఆమె కివ్వాళ ఆయ నెప్పుడు తిరిగి వస్తారో అన్న ప్రశ్న రానేలేదు.

తాను ఒంటరి దాన్ననే భావన కలిగే సరికి, అలవాటు ప్రకారం చేతులు రేడియో మీదికి వెళ్ళాయి. రేడియోలో ఇలా విన్పిస్తోంది 'స్వప్నభంగం..... నాటిక...రచన ... పినాకీ ... పాల్గొనువారు.....'

'అరె! పినాకీదా యీ నాటిక!' అనుకుంటూ కాదంబిని సోఫాలో కూలబడింది

రేడియోలో 'అది వాఘిరా నదీతీరం. అజంతా గుహల సమీపంలో, వాఘిరా జలపాతం దగ్గర సాయం సంధ్య'

'అవును, సరిగ్గా అదే అజంతా. అదే వాఘిరా'...అనుకుంటూ కాదంబిని, కాప్పులోని గులాబీ రేకులు లాగేస్తోంది.

మళ్ళీ రేడియో 'శిలలోన కలలన్ని నిదురించెనా? కలలన్ని శిలలందు చిగురించెనా?'

'అరె! యీ పాట అప్పుడు నేను పాడిందే! కాలం ఎంత మారింది! అయినా పాట అదే. ఓహ్! ఆ పాట విన్న పినాకీ పారవశ్యంలో, తన బాహుబంధంలో...ఇరికించుకొన్నాడానాడు!'

రేడియోలో ఆడగొంతు 'చెప్పేరు గాదు. కవులు మాత్రమేగాక గాయకులు కూడా నని. నాగస్వరం వింటే ఏ పాము పడగ విప్పి నాట్యం చెయ్యదు? ప్రకృతిని కంటే ఏ రసజ్ఞుడు పరవశించడు?'

'ఆడవాళ్ళ కుండేది ఈర్ష్య మాత్రమే నని, నన్ను పాముతో పోల్చి నీవు నిరూపించుకున్నావు. నీ పొగడ్తల్తో నా గానంకన్న నీ తెలివే బయటపడింది మంజూ!' అన్నదో మగ గొంతు రేడియోలో.

కాదంబిని మనస్సు పదేళ్ల వెనకటి మరపు చీకటిని తొలగించుకొంటూ, జ్ఞాపకాల కాంతి మార్గాన పోయి, అజంతాకు

చేరింది. తానే...అనాడు పాడింది. పాట రాసిందికూడా తానే. ప్రశంస పలికింది పినాకీ! చల్లని చివాట్లుకూడా తిన్నాడు. కథంతా యిప్పుడు మారిందేం? పినాకీ మర్చిపోయి ఉంటాడు. అయినా తాను మరువలేదన్న సంగతి అతనికెలా తెలుస్తుంది?

రేడియోలో ఆడగొంతు 'శిలల్లో

కలలు నిదురించటం ఎలా ఉన్నా, అజంతా గుహల్లోని ప్రతి అణువులోనూ. శిల్పుల స్వప్నాలు చిగురించే ఉంటాయి!'

'కాదు మంజూ! శిలల్లో కలలు చిగురించటం నీకు నచ్చింది. కలలన్నీ శిలల్లో నిదురించటం అనేది నాకు నచ్చింది. ఎవరి అనుభవం వాళ్ళది' – మగగొంతు.

కాదంబిని మనసు గుహల కెదురుగా తలపులజలపాతం పడుతోంది. జ్ఞాపకాల వెన్నెలపడి, ఆ జలపాతం కురుస్తోంది కోర్కెల తుంపురుల్ని. ఆ తుంపురుల్లో తడుస్తున్నారు పినాకీ...తానూ..... ఆనాడు...ఒంటిగా బండమీద కూర్చొని పాడుకుంటోంది. పినాకీ పిచ్చి చేష్టల్ని ఆపిద్దామని, అతన్ని కోపంతో మందలించింది. పినాకీ సిగ్గుపడ్డాడు..... మరిప్పుడో.....తానోడిపోయానని చెప్పుకోలేక, తన ప్రతాపాన్ని కనీసం కథల్లోనన్నా సార్థకం చేసుకుందామని ప్రయత్నిస్తున్నాడు పినాకీ' అనుకుంది కాదంబిని.

ఇంతలో ఆమెకు జ్ఞాపకం వచ్చింది నాటిక అయిపోతోందని.

మగగొంతు...'మనిషికున్న ప్రతి పరిచయం ప్రేమకాదు. స్నేహం అవొచ్చు. ప్రేమించటమంటే ఓడిపోవటమని నా నిర్వచనం. మన మిద్దరమూ, ఒకరి చేతులో మరొకరం ఓడిపోయామని వినటం నా కిష్టంలేదు!

ఆడగొంతు...'ఇంతవరకూ నాకో కలలాంటి నమ్మకం ఉండేది. స్త్రీ ప్రేమను తిరస్కరించే ప్రవరులు నేటి కాలాన లేరనీ, అది తప్పని నీవు చెప్పావు! నా కీరోజుతో స్వప్నభంగం..... అయింది.'

విరామ సంగీతం శాస్త్రకట్టుగా మోగుతోంది. కాదంబిని దాని గొంతు నొక్కింది. బయటినుంచి వచ్చిన పెద్ద గాలికి, రేడియోపైనబెట్టిన సెల్యులాయిడ్ బేబీ (అదే ఆయింటికంతా బిడ్డ!) క్రింద పడింది. దాన్ని చేతుల్లో పెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'సోఫాలో నిద్రపోతున్నావేం?' అంటూ ప్రవేశించిన భర్తను చూచి మళ్ళీ ముఖాన్ని చేతుల్లో కప్పుకొంది కాదంబిని.

భర్త వచ్చి ప్రక్కనే కూర్చొని, "ఏమిటీ ... చిన్నపిల్లలాగా.....యీ బొమ్మేంటి.....? ఏయ్! కాదంబీ! మాట్లాడకుండా దుఃఖిస్తే నిన్నెవరు ఓదార్చగలరు?' అన్నాడు గోముగా!

'నన్ను మీరేమీ ఓదార్చ నక్కరలేదు! బజారులోని క్లబ్బుల్ని...చీట్లపేకలోని ...రాణీలనూ ఓదార్చండి,' అంది

'నే నెవరినైనా ఓదార్చగలను. పోతే నన్ను నేనే కూడా ఓదార్చుకోగలను; ఎటొచ్చీ నిన్నే.....' అన్నాడు నవ్వుతూ తల నిమురుతూ.

'నన్నుగూర్చి జాలెందుకూ ? జాలి ఉంటే వెక్కిరింపెందుకూ?' అంది.

'నీవు దుఃఖంలో అన్నిటినీ మరచి మాట్లాడుతున్నావు. నీవు దుఃఖించటంలో నాకేమీ జాలి లేదు. పోతే ఎప్పటికి మానేయ గలుగుతావో తెలీకమాత్రమే జాలి పడుతున్నాను ' అన్నాడు భర్త.

'మీరు రాత్రినంతా క్లబ్బులో గడపటం మానేయ గలిగినప్పుడు' అంది.

'ఇంటిదగ్గర గడుస్తుందని నమ్మకం వచ్చినప్పుడు అలాగే మానేస్తాను ' అన్నాడు.

'ఇంటిదగ్గర గడవదేమోనన్న భయం, మీ బలహీనత' అంది

'కాదంబీ! శుష్కతర్కం నాకొద్దు. పదేళ్ళ అనుభవం నాకు నేర్పింది క్లబ్బుల్లోకి పొమ్మని. ఇవాళిటికీ నా నమ్మకం అదే. నాకు మనుష్యుల్తో వాదించంటం లోనూ, భేదించటంలోనూ ఉన్న కుతూహలం క్రీడలాంటిది. అందుకే నే నెవరినీ పోగొట్టుకోనని నాకు తెలుసు. పోతే నీకది ఓ వృత్తిలాంటిదై పోయింది. అనుభవం బొత్తిగా ఉండదు కొంత మందికి. ఉన్న అనుభవాన్ని, త్రాగలేక బోర్లపోసుకునేవాళ్ళు మరి కొంతమంది. ఆ రెండు జాతులకూ నేను చెందను అనుభవం వస్తే వద్దనను. రాకపోతే దాన్ని వెతుక్కుంటూ నే నే పోతాను. నాకు అనుభవం కావాలి. తర్కం వద్దు.' అన్నాడు భర్త.

'అనుభవం ఎప్పుడో ఒకప్పుడు అందరికీ వస్తుంది' అంది.

'అనుభవాలందరికీ వస్తాయి. పోతే నూటికి తొంభై మందికి రానిదల్లా ఒక్కటే అనుభవానికి సంబంధించిన భావన ' అన్నాడు.

'మీ భావన...ఎక్కడో నాకు తెలీదా? అందరికీ అలాంటి భావాలే ఉంటే...' అంది కాదంబిని

'నా భావన ఎక్కడో నీకు తెలుసు. పోతే నా ఆనంద మెక్కడో, అదే తెలీదు నీకు మనుష్యుల్ని వాదంతో, భేదంతో జయించలేమని ఇప్పటికీ నీకు తెలియదు నీకు తెలిసిందల్లా గెలుద్దామనుకొని, ఓడిపోవటం' అన్నాడు నవ్వుతూ.

'నేనేమీ ఓడిపోలేదు, ఎవ్వరితోనూ' అంది కాదంబిని

'ఎవ్వరితో గెలిచావ్ కనుక ? అన్నాడు భర్త.

'నిజమేనా ?...' అనే ప్రశ్న పొడసూపింది ఆమె మనస్సులో. ఇంతలో 'తలుపులువేసి పడుకో.' అంటూ భర్త తన గదిలోకి వెళ్ళిపోయాడు. 'అనుభవాన్ని వెదుక్కోటానికా ?' అంది రుసరుసలాడుతూ

భర్త ఒక చిఱునవ్వు విసిరి వెళ్ళిపోయాడు ప్రక్కగదిలోకి

పావుగంట గడిచింది గదినిండా చిక్కని నిశ్శబ్దం. కాదంబిని తలెత్తి

చూచింది. ఎదురుగుండా గోడగడి యారంలో పెద్దముల్లూ చిన్నముల్లూ పన్నెండు మీద ఒక్కక్షణం కలుసు కున్నయ్. నేటి ఒడ్డునుంచి రేపటి ఒడ్డుకు వంతెన వేస్తున్నట్లు. ఇంతలో ముఖం మీద పడుతున్న ముంగురుల్ని రేపుతూ చిరుగాలి వీస్తోంది. పర ధ్యానంలో బొమ్మను జారవిడిచింది క్రిందకు. ఆమె బొమ్మకోసం వంగింది. సోఫాలోని దిండు ఆమెపై వాలింది నెమ్మదిగా బుజ్జగిస్తున్నట్లు. ఎందుకో వళ్ళు జలదరించింది. గోడమీద కుట్టు పనితో తాను చేసిన చిత్రంలోని రెండు పక్షులూ, పిల్లలకి మేత అందిస్తున్నయ్ తలుపులు వేద్దామని లేచిన కాదంబిని భర్త గదివైపు నడిచింది తలుపులు తీసి ఉన్నయ్. ఆమెలోని ఏదో లక్షణం త్రుళ్ళింతవేయగా, నెమ్మదిగా తెర తొలగించి, మంచం దగ్గరకు వెళ్ళింది. కాని భర్తముఖం గోడవైపుకు త్రిప్పి ఉంది. రెండు నిమిషాలు భర్తవైపు చూచి, దుప్పటి సరిగ్గా కప్పి ఆమె బయటికి నడిచింది

ఆమె బరువుగా అడుగులు వేస్తూ వచ్చి మంచంమీద కూలిపోయింది దిగు లుకు మారుపేరులాంటి దిండులో ముఖాన్ని దాచేసుకుంది ఆమెలోని తర్కంపోయి, అనుభవంవచ్చి కూర్చుంది గుండెమీద బరువుగా ఆనందం, దుఃఖం మనిషి ఎక్కడో వెదుక్కునేవి కావని, మనిషిలోనే వాటిని వెదుక్కోవాలని, ఎవరో చెప్పినట్టైంది ఆనందం ఒకరిచ్చేదికాదు. మనం పుచ్చు కునేది పుచ్చుకునే తాహతున్నా, పుచ్చు కోలేని లక్షణం, అది అతిశయం కాదని, ఆ పేరుతో మనిషి తనలో దాచుకొంటూ ముద్దుగా పెంచుకునే దౌర్బల్యం అని ఆమెకు తెలిసిందిప్పుడు. ఆమె తీసే దీర్ఘ నిశ్వాసాలు ఆమె కోల్పోయిన-దేనికో చిహ్నాలు. రాత్రిలో మందంగా వీచే గాలి అప్పుడప్పుడూ ఆమెను చూచి జాలి పడ్డట్లు చెక్కుల్ని తాకుతోంది.

ఆమె మనస్సు యిప్పుడొక ప్రశ్నో పనిషత్తు ఆమె జీవితం ఒక బృహ దారణ్యకం.

మరునాటి ఉదయం కాదంబినిని లేప టానికి వచ్చిన భర్తకు కనిపించింది ఆమె ఎఱ్ఱటి కళ్ళూ, తడిసిపోయిన దిండూ, కిర్రదపడి పాడై నలిగి పోయిన సెల్యు లాయిడ్ బేబీ